
# పుట్టుమచ్చ



– తంబు

రిక్షా రంగడి కొడుకు రవి, కోటేశ్వర్రావు గారి ఏకైక పుత్రిక రాధ వేరే పనిలేక పరస్పరం ప్రేమించుకున్నారు. కాబట్టి- "ఈ నెత్తావి తెమ్మెరలో నాకు బలే తిమ్మిరిగా వుంది" అనే పాట మొదటి చరణం ఊటీలో పాడి సైకిలు తొక్కుతూ, రెండో చరణం పాడ్డానికి అరకులోయలోకి వచ్చారు. అప్పుడు ఆ సైకిలు అందమైన కారులా మారిపోతుంది. అక్కడ రాధ చలేస్తున్నా సరే చచ్చినట్టు నీళ్ళల్లో మునిగి "అబ్బ లాగుతున్నాయి నరాలు - తాళలేనింక పూలల్లోని శరాలు" అనే రెండో చరణం పాడాక కారులో స్పీడుగా బయల్దేరారు.

కథాక్రమం కొద్దీ దార్లో ఏక్సిడెంట్ అవుతుంది. రవి కారులోనే తెలివితప్పి పడిపోయాడు. రాధ కార్లోంచి కొండచరియల్లోకి దొర్లి లోయలో వున్న గెడ్డం బాబాగారి పూరిపాకలో మంచం మీదకి జాగ్రత్తగా పడింది. రాధ, గోపి గత స్మృతులు కోల్పోయారు. తెలివి తప్పి పడివున్న రవిని రత్నభూషణరావు అనబడే పిల్లలులేని లక్షాధికారి తీసుకువెళ్ళాడు.

రాధని చూడగానే చిన్నప్పుడు తప్పిపోయిన తన కూతురు, పైడితల్లి జ్ఞాపకం వచ్చి గెడ్డం బాబా ఆమెను అమిత వాత్సల్యంతో చూడసాగాడు.

ఆస్థికోసం కాకుల్లా కాచుక్కూర్చున్న వారసులకి కాకుండా రవికే రాసిచ్చేద్దామనుకున్న రత్నభూషణరావు- దత్తత చేసుకుందామనుకున్నాడు.

ఏక్సిడెంట్ సంగతి తెలిసి రవితండ్రి రంగయ్య లబోదిబో మంటూ రిక్షాతొక్కుకుంటూ రత్నభూషణరావుగారిల్లు చేరుకున్నాడు. తండ్రిని గుర్తించలేక తనయుడు రవి "ఎవరు నువ్వు" అని రంగయ్యని అడిగాడు. డబ్బుకి ఆశపడి కన్నతండ్రినే గుర్తుపట్టనట్టునటిస్తున్నాడనుకుని రంగయ్య "నీలాంటివాడు నా కొడుకే కాదు" అని ఆవేశపడ్డాడు. "అదే నేనూ అంటున్నాను" అన్నాడు రవి అమాయకంగా. కళ్ళనీళ్ళు గుక్కుకుని, కోపం దిగమింగుకుని రంగయ్య తిరిగి వెళ్ళిపోయాడు.

కూతురికోసం వెదికి వెదికి వేసారి కోటేశ్వర్రావుగారు గెడ్డం పెంచుకుని, కళ్ళద్దాలు పెటుకుని, శాలువా కప్పుకుని, అస్తమానం ఆస్థమావున్నవాడిలా దగ్గుతూ కూతుర్ని వెదుకసాగాడు.

కన్నతండ్రిలా అభిమానంగా చూస్తున్నాకూడా గెడ్డంబాబా ప్రవర్తన రాధకి ఏమాత్రం నచ్చలేదు. చీటికి మాటికీ సినిమాలో తండ్రిలా "నా తల్లీ నా తల్లీ" అని అనవసరంగా కౌగలించుకోడం, రాత్రి వేళ తన గదిలోకి వచ్చి నడుం

## స్వగతంబు

మీద చెయ్యి హస్తమేకాక బేట్రీలైటు కూడా వేసి ఇంకా క్రింది భాగాలు వెదక ప్రయత్నించడం రాధకి ఎంతో భయాన్ని, ఆందోళనని కలుగచేస్తాయి.

ఒక రోజు రాత్రి గెడ్డం బాబా బేట్రీలైటుతో తన గదిలోకి దొంగలా రాగానే "ఏమిటీ పని బాబా! నేను నీకు కూతురులాంటి దాన్ని కదా" అనడిగింది. "అందుకే తల్లీ ఈ అన్వేషణ" అని బాబా ఆమెను కౌగలించుకోబోయాడు. రాధ తప్పించుకుంది. "నిన్ను చూస్తుంటే తప్పిపోయిన నా కూతురు జ్ఞాపకం వస్తోంది. నా కూతురుకి పిర్రమీద పుట్టుమచ్చ వుంటుంది. నువ్వు నా కూతురివే అయివుంటావు. ఏదీ ఒక్కసారి చూడనియ్యి" అని బతిమాలసాగాడు.

"పుట్టుమచ్చ వుంటే కూతుర్నే అవుతాను. లేకపోతే అంతా చూశాక కూతుర్ని కాదుకదా అని నీకేదైనా దుర్బుద్ధి పుడితేనో" అని రాధ మొరాయించింది. బాబా చూపించమని బలవంతం చెయ్యసాగాడు. రాధ చూపించనని పెనుగులాడసాగింది. రాధ అడవుల్లోకి పారిపోయింది, గెడ్డం బాబా వెంబడించసాగాడు.

రంగయ్య రిక్షాలో దేవుడి గుడికి వెళ్ళి తిరిగి వస్తున్న కోటేశ్వర్రావు రాధని చూసి రిక్షాలోంచి దూకేసి "తల్లీ ఇన్నాళ్ళకి దొరికావా" అని ఆమెను వాత్సల్యంతో కౌగలించుకోబోయాడు. తండ్రిని గుర్తించలేని రాధ "నువ్వు కూడా పుట్టుమచ్చ చూపించమంటావా?" అని చీదరించుకుని పారిపోసాగింది. ఆమె వెనక

రంగయ్య రిక్షాలో కోటేశ్వర్రావుగారు, వారి వెనక గెడ్డం బాబా వెంబడించ సాగారు.

కారులో షికారుకి వెళ్ళిన రవి రాధను రక్షించి కారులో ఎక్కించుకుని తీసుకు వెళ్తా గత స్మృతులు గుర్తులేక సరికొత్తగా రాధని ప్రేమించసాగాడు.

ఆస్తికోసం రవిని హత్య చెయ్యడానికి రత్నభూషణరావుగారి వారసులు రాధని హత్య చెయ్యడం కోసం కోటేశ్వర్రావు గారి వారసులు కర్రలతో బయల్దేరి దారిలో ఒకరికొకరు ఎదురై దెబ్బలాడుకో సాగారు. అటువైపే వచ్చిన కారులో వున్న రాధకి రవికి తలొక్కంటికి ఒక్కొక్క దెబ్బ తగిలాయి. పర్యవసానంగా ఇద్దరికి గత స్మృతులు జ్ఞాపకం వచ్చాయి. వాటితోపాటు పోలీసులు వచ్చి దుండగుల్ని పట్టుకున్నారు.

గత స్మృతి వచ్చిన రవి, తండ్రి రంగయ్యని గుర్తుపట్టి "నాన్నా" అని కౌగలించుకున్నాడు. రత్నభూషణరావు ఆస్తి అంతా అతనికి రాసిచ్చి సజల నయనాలతో దీవించి వెళ్ళిపోబోతుంటే రంగయ్య ఆయన్ని పిల్చి "కారు లేకుండా ఎలా వెళ్తారు బాబూ! ఈ రిక్షా తీసేసుకోండి బాబూ" అని రిక్షా త్యాగం చేశాడు. ఆయన రిక్షా తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు.

రవి రాధకేసి చూసి చూసాడు. రాధ సిగ్గుతో తల దించుకుంది.

క్రీగంట అతడ్ని కొంటెగా చూసింది.

ఇంతలో గెడ్డంబాబా వచ్చి "రాధకి పిర్ర మీద పుట్టుమచ్చ వుంటుంది" అన్నాడు. నీ పుట్టుమచ్చ ఆ గెడ్డంగాడికి ఎలా తెలుసు నీచురాలా" అని రవి ఆమెని అపార్థం చేసుకున్నాడు.

కోటేశ్వర్రావుగార్ని గుర్తుపట్టిన రాధ "నాన్నా" అంటూ వచ్చి తండ్రిని కౌగలించుకుంది. దాన్తో ఆయనకి వూపిరి ఆడక దగ్గు వచ్చింది. ఆయన కాస్సేపు అలా దగ్గి దగ్గి "రాధ నా స్వంత కూతురు కాదు. పద్దెనిమిదేళ్ళ క్రితం సంతలో దొరికింది. పిర్రమీద పుట్టుమచ్చ వుంది" అని చెప్పి చచ్చిపోయాడు. కాని గెడ్డం బాబా ఇచ్చిన కషాయం తాగి గండం గడిచిపోయింది. కొండలన్నీ పరుగెట్టిన ఆయాసానికి గుండెపోటు వచ్చి తట్టుకోలేక, ఎన్ని మూలికలు నమిలినా లాభం లేక, మిగిలిన మూలికల్ని, ఔషధాల్ని, రాధని కోటేశ్వరరావు చేతిలోపెట్టి "కన్న తండ్రివికాకపోయినా రాసి బాధ్యతమీదే!" అని గెడ్డం బాబా హఠాత్తుగా కన్ను మూశాడు.

ఇంతలో రాధ వాంతి చేసుకుంది. పుట్టుమచ్చ సంగతి క్షమించినా రాధకి వాంతి ఎందుకు వచ్చింది, అని రవి మళ్ళీ ఆమెను శంకించబోతూ వుండగా రాధ అతడ్ని కార్లో ఎక్కించుకుని "ఈ నెత్తావి తెమ్మెరలో నాకు భలే తిమ్మిరిగా వుండి" అని పాట ప్రారంభించింది. "అవును జ్ఞాపకం వచ్చింది" అన్నాడు రవి.

కథ సుఖాంతమే కానీ పుట్టుమచ్చని మనం చూడలేదే అనే బాధ మనకి మిగిలిపోతుంది.

[నీతి :— తెలుగు సినిమా కథలు పురాణముల వంటివి. ఎన్నిసార్లు చూసినా, వినినా, చదివినా, రాసినా పుణ్యమే!

★



## గజల్ చక్రవర్తి శ్రీ మెహదీ హసన్

సంగీత మహార్ణవంలో చందమామ శ్రీ మెహదీ హసన్. ఆయన పెదవి దాటి ప్రతి గజలూ వొక వెన్నెల కిరణం. వాగ్దేవి స్వయంగా గజ్జెకట్టి నర్తించినట్లు వుంటుంది. దాదాపు ముప్పై సంవత్సరాలుగా కోట్లాది సంగీత ప్రియులను వారి గజల్ గానం అలరిస్తోంది. తెలుగువారు విశేషంగా అభిమానించే శ్రీ బాపు–మెహదీ హసన్ సంగీతం వుంటే మరేమీ అక్కర్లేదంటారు. ఈ సంవత్సరం జనవరి 26 న హైదరాబాదులోని రవీంద్రభారతిలో శ్రీ హసన్ సంగీత కార్యక్రమాన్నిచ్చి శ్రోతలకు వీనుల విందు చేశారు. ఆ సందర్భంగా శ్రీ బాపు చిత్రించిన గజల్ చక్రవర్తి రేఖాచిత్రం ఇది